# ‘ఆఫీసర్’ కల సాకారం

- నర్సు ఇక నుంచి నర్సింగ్ ఆఫీసర్
- ఉత్తర్వులు జారీ.. నేటి నుంచే అమలు
- మారిన 14 వేల మంది హోదాలు
- సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీశ్‌కు కృతజ్ఞతల వెల్లువ



ఖైరతాబాద్‌లోని సీహెచ్‌సీలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి రాష్ట్ర సర్కారుకు జై కొడుతున్న నర్సింగ్ స్టాఫ్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఏండ్లుగా ఎదురుచూస్తున్న నర్సుల కల సాకారమైంది. తమ వృత్తికి, చేస్తున్న సేవకు మరింత గౌరవం తెచ్చేలా ‘ఆఫీసర్’ అని పిలిపించుకోవాలన్న కోరికను రాష్ట్ర ప్రభుత్వం నెరవేరింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ సిబ్బంది హోదాలను ‘ఆఫీసర్లు’గా మార్చింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు శనివారం నుంచే అమలవుతాయని పేర్కొన్నది. వైద్యారోగ్యశాఖతోపాటు, ఇతర శాఖల్లో విధులు నిర్వర్తించే నర్సింగ్ సిబ్బందికీ ఇది వర్తిస్తుందని ఆదేశాల్లో తెలిపింది. తాజా ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 14 వేల మంది నర్సులకు ప్రయోజనం కలుగనున్నది.

### రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు

నర్సుల హోదాను ఉన్నతీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా నర్సులు సంబురాలు చేసుకున్నారు. తమకు సమాజంలో మరింత గౌరవం పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు, ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. పీహెచ్‌సీలు స్థాయి నుంచి గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ప్రధాన దవాఖానల వరకు కేకులు కట్ చేసి, స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. గాంధీ దవాఖానలో నర్సింగ్ ఆఫీసర్లను సూపరింటెండెంట్ రాజారావు సన్మానించారు. నిమ్స్‌లో సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలుపుతూ నిమ్స్ నర్సెస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉస్మానియా, నిలోఫర్ దవాఖానల్లోనూ నర్సులు సంబురాలు జరిపారు. ఖైరతాబాద్‌లోని సీహెచ్‌సీలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వరంగల్ ఎంజీఎంలో తెలంగాణ గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

| గత హోదా | మారిన హోదా |
|---|---|
| స్టాఫ్ నర్స్: | నర్సింగ్ ఆఫీసర్ |
| హెడ్ నర్స్: | సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ |
| నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2: | డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్ |
| నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1: | చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ |
| పబ్లిక్ హెల్త్ నర్స్: | పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ |

### సర్కారు దవాఖానలపై నమ్మకాన్ని పెంచండి



ప్రభుత్వ నర్సింగ్ సిబ్బందికి శుభాకాంక్షలు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మీ గౌరవాన్ని మరింత పెంచేలా హోదాలను ఉన్నతీకరిస్తూ ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రేమ, ఆప్యాయతలతో కూడిన వైద్యసేవలు ప్రజలకు అందించి ప్రభుత్వ దవాఖానలపై ఉన్న నమ్మకాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షిస్తున్నా.

*- హరీశ్‌రావు, ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి*

### ఆరోగ్య తెలంగాణలో భాగమవుతాం



నర్సుల్లో బీఎస్సీ, ఎమ్మెస్సీ వంటి ఉన్నత కోర్సులు, స్పెషలైజేషన్ చేసినవాళ్లున్నారు. ఎంత చదివినా ‘నర్సే’ కదా అనేవారు. ఇప్పుడు ఆఫీసర్ అని మార్చడం వల్ల మా విద్యార్హతలకు తగిన గౌరవం దక్కినట్టుగా భావిస్తున్నాం. మా హోదాలు పెంచిన సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు. ఆరోగ్య తెలంగాణలో భాగమవుతాం.

*- శైలజ, నర్సింగ్ ఆఫీసర్, సీహెచ్‌సీ ఖైరతాబాద్*

### రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాం



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నర్సుల విజ్ఞప్తులను ప్రభుత్వం పరిశీలించి, సానుకూలంగా స్పందించి హోదాను మార్చినందుకు ధన్యవాదాలు. దశాబ్దాల మా కలను సాకారం చేసినందుకు సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీశ్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రభుత్వ నిర్ణయంతో సమాజంలో మా గౌరవం మరింత పెరుగుతుంది. ఇక నుంచి రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాం.

*- లక్ష్మణ్, నర్సింగ్ ఆఫీసర్, ఎన్‌వోఏ వ్యవస్థాపకుడు*

### హోదా మార్పుతో గౌరవం పెరుగుతుంది..



నర్సింగ్ ఆఫీసర్ అని చెప్పుకోవడం ఆత్మవిశ్వాసం పెంచుతుంది. ఈ హోదా మార్పుతో గౌరవం కూడా పెరుగుతుంది. తద్వారా రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలు కలుగుతుంది. ఇప్పటివరకు మేం ఎంతసేవ చేసినా చిన్నచూపు చూస్తున్నారనే భావన ఉండేది. ఇప్పుడు మరింత ఉత్సాహంతో పనిచేస్తారు.

*- రాజేశ్వరి ముప్పిడి, ట్రెయిన్డ్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు*

# టీచర్ల బదిలీలపై స్టే

మొదటిపేజీ తరువాయి...

స్థానికులమని పిటిషనర్లు తెలిపారు. చాలా కాలం తరువాత రాష్ట్ర ప్రభుత్వం వివిధ క్యాడర్ల టీచర్ల బదిలీ, పదోన్నతులకు అవకాశం కల్పిస్తూ జీవో నం.5 జారీ చేసిందని పేర్కొన్నారు. అధికారులు రూపొందించిన సీనియార్టీ జాబితాపై పిటిషనర్లు అభ్యంతరం లేవనెత్తారు. ఇతర జిల్లాల వారిని జాబితాలో చేర్చి ప్రచురించారని ఆరోపించారు. ఇది స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌లోని 38(డి) నిబంధనకు విరుద్ధమని తెలిపారు. సీనియారిటీ తుది జాబితా సిద్ధమయ్యే వరకు బదిలీలు ఆపాలి అని విజ్ఞప్తిచేశారు. ఈ వివరాలు విన్న న్యాయమూర్తి.. టీచర్ల బదిలీలను తాత్కాలికంగా నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను ఈనెల 19కి వాయిదా వేశారు.




# ఏపీకి 45, తెలంగాణకు 35

**టీఎంసీల చొప్పున కేటాయింపు**

**పొదుపుగా వాడుకోండి.. నీళ్లులేవు జాగ్రత్త: కేఆర్‌ఎంబీ సూచన**

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగినంతగా లేవని, వచ్చే ఏడాది వరకు తాగు నీటి అవసరాలు ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) సూచించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న జలాల్లో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి కేటాయించారు. ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించిన అంశంపై త్రిసభ్య కమిటీ సమావేశం మెంబర్ సెక్రటరీ రాయపురే అధ్యక్షతన శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఈఎన్సీ మురళీధర్, ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి ఈ ఏడాది ఇరు రాష్ట్రాలకు నీటి అవసరాలకు సంబంధించిన ఇండెంట్లను బోర్డుకు నివేదించారు. అనంతరం మెంబర్ సెక్రటరీ మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో ఉమ్మడి రిజర్వాయర్లకు నిర్దేశిత మొత్తంలో జలాలు రాలేదని, ప్రస్తుతం నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లలో కేవలం 82.78 టీఎంసీలు మాత్రమే వినియోగానికి అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. వచ్చే ఏడాది జూన్-జూలై వరకు తాగు నీటి అవసరాలు తీర్చాల్సి ఉన్నదని తెలిపారు.

# సమగ్ర అభివృద్ధికి శాస్త్ర,సాంకేతికత కీలకం

- విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి
- టీఎస్ కాస్ట్ సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): సమగ్ర అభివృద్ధికి శాస్త్ర & సాంకేతికత (సైన్స్ అండ్ టెక్నాలజీ) కీలకమని అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర సైన్స్ అండ్ సాంకేతిక మండలి (టీఎస్ కాస్ట్) 3వ కార్యనిర్వాహక సమావేశం జరిగింది. ఎన్నడూ లేనివిధంగా టీఎస్ కాస్ట్ 2021-22, 2022-23లో రూ.15.14 కోట్ల గ్రాంటును ఇన్నోవేషన్ హబ్, స్కిల్ డెవలప్‌మెంట్, ఎస్సీ, ఎస్టీ సెల్, పేటెంట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ వంటి కార్యక్రమాలకు వెచ్చించిందని సభ్య కార్యదర్శి ఎం నగేశ్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచి సైన్స్ బోధనను మెరుగుపర్చేందుకు మౌలిక వసతుల కల్పన ఇతర అంశాలపై పాఠశాల విద్యాశాఖ, విద్యా పరిశోధన, శిక్షణ మండలితో టీఎస్ కాస్ట్ సమన్వయం చేసుకోవాలని సూచించారు. మూఢనమ్మకాలతోపాటు నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని సూచించారు. టీఎస్ కాస్ట్ పనితీరు బాగున్నదని అభినందించారు. ఆరోగ్యం, పర్యావరణం, జీవవైవిధ్యం, వ్యవసాయ రంగాలలో 25 పరిశోధన ప్రాజెక్టులు మంజూరు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రజత్ కుమార్, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి ఆర్ రవి, జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ జనరల్ స్నేహలత, రెడ్కో వీసీఎండీ జానయ్య, తమిళనాడు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ సభ్య కార్యదర్శి డాక్టర్ ఆర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

# 40 కాదు.. 50 శాతమే

- ఎంబీబీఎస్ కోర్సు ఉత్తీర్ణత మార్కులపై వెనక్కి తగ్గిన ఎన్‌ఎంసీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: ఎంబీబీఎస్ కోర్సు ఉత్తీర్ణత మార్కుల పర్సంటేజ్‌ను తగ్గిస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని నేషనల్ మెడికల్ కమిషన్ వెనక్కి తీసుకుంది. ఇటీవల తీసుకొచ్చిన 40 శాతం పాస్ విధానాన్ని సవరిస్తూ ఎన్‌ఎంసీ నిర్ణయం తీసుకుంది. పాత విధానం ప్రకారమే 50 శాతం పాస్ పర్సంటేజ్ ఉంటుందని తాజాగా వెల్లడించింది. పూర్తిగా పరిశీలించిన తర్వాతే నిర్ణయాన్ని మార్చుకున్నట్టు శుక్రవారం అధికారికంగా ఓ నోటిఫికేషన్‌ను ఎన్‌ఎంసీ విడుదల చేసింది. సాధారణంగా ఎంబీబీఎస్ కోర్సులో అగ్రిగేట్ సబ్జెక్టుల్లో (థియరీ, ప్రాక్టికల్ కలిపి) ఓవరాల్‌గా కోర్సు చివర్లో 50 శాతం మార్కులు వస్తేనే ఉత్తీర్ణతగా పరిగణిస్తారు. అయితే సెప్టెంబర్‌లో ఈ పాస్ పర్సంటేజ్‌ను 40 శాతానికి తగ్గిస్తూ ఎన్‌ఎంసీ నిర్ణయం తీసుకుంది. దానికి తగ్గట్టుగా కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీబీఎంఈ) పాఠ్య ప్రణాళిక (కరిక్యులమ్) మార్గదర్శకాలను సవరించింది. తాజాగా ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

# తిరుమలకు గత నెల 100 కోట్లు ఆదాయం

- గత ఏడాది మార్చి నుంచి వరుసగా భారీగా ఆదాయం

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారిపై మరోసారి కాసుల వర్షం కురిసింది. సెప్టెంబర్‌లో హుండీ ద్వారా రూ.111.65 కోట్లు వచ్చినట్టు టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ‘డయల్ యువర్ ఈవో’లో ఆయన పలు వివరాలు వెల్లడించారు. గత నెలలో శ్రీవారిని 21.01 లక్షల మంది భక్తులు దర్శించుకోగా, లడ్డూలు 1.11 కోట్లు విక్రయించారు. గత ఏడాది మార్చి నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం నెలకు రూ.100 కోట్ల మార్క్ దాటేసింది. తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో నూతనంగా వేదాశీర్వచనం, కుంకుమార్చన ఆర్జిత సేవలను ప్రవేశపెట్టామని, టీటీడీ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని చెప్పారు. శ్రీపద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్‌కు ఆసియా టుడే రీసెర్చ్ అండ్ మీడియా సంస్థ ‘ప్రైడ్ ఆఫ్ నేషన్’ అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందని తెలిపారు. తిరుపతికి చెందిన సూర నరహరి-కుసుమ దంపతులు స్థానిక శ్రీకపిలేశ్వర స్వామికి దాదాపు రూ.14 లక్షల విలువైన 16 కిలోల వెండితో నాగపడగ, కిరీటం బహూకరించారు.

# కానిస్టేబుల్ ఫలితాల్లో స్టడీ సర్కిళ్ల సత్తా

- బీసీ సర్కిల్స్ నుంచి 182 మంది ఎంపిక
- ఎస్సీ సర్కిల్స్ నుంచి 234మందికి ఉద్యోగాలు
- మంత్రి గంగుల కమలాకర్ అభినందనలు

హైదరాబాద్, అక్టోబర్6 (నమస్తే తెలంగాణ): కానిస్టేబుల్ ఫలితాల్లో ప్రభుత్వ స్టడీ సర్కిల్స్ సత్తా చాటాయి. ఎస్సీ, బీసీ సర్కిళ్లలో శిక్షణ పొందిన వందలాది మంది అభ్యర్థులు ఉద్యోగాలు దక్కించుకొన్నారు. రాష్ట్రంలోని 12 బీసీ స్టడీ సర్కిల్స్‌లో 862 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ పరీక్షకు శిక్షణ పొందారు. ఇందులో 182 మంది అభ్యర్థులు (21%) కొలువులు సాధించినట్టు బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడించారు. విజయం సాధించిన అభ్యర్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చక్కటి పాఠ్యప్రణాళిక, నాణ్యమైన శిక్షణ, ప్రతీ అభ్యర్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ, రెగ్యులర్‌గా పరీక్షలు నిర్వహించడం వల్ల ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. హైదరాబాద్ స్టడీ సర్కిల్ నుంచి 9, ఆదిలాబాద్ 46, జోగులాంబ గద్వాల్ 21, కరీంనగర్ 8, ఖమ్మం 42, మహబూబ్ నగర్ 6, నల్గొండ 6, నిజామాబాదు 13, రాజన్న సిరిసిల్ల 8, సంగారెడ్డి 9, సిద్దిపేట 5, వరంగల్ నుంచి 9 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ కొలువులు సాధించారని వివరించారు.

### 11 ఎస్సీ స్టడీసర్కిల్స్ నుంచి 234 మంది..

రాష్ట్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్స్ నుంచి 234 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందారు. ప్రభుత్వం జిల్లాకొకటి చొప్పున 33 ఎస్సీ స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేసింది. వీటిల్లో 3,300 మందికిపైగా అభ్యర్థులు పోలీస్ కొలువులకు శిక్షణ పొందారు. ఇప్పటివరకు 11 ఎస్సీ స్టడీ సర్కిల్స్ నుంచి 234మంది అభ్యర్థులు కొలువులను సాధించినట్టు స్టడీ సర్కిల్ జేడీ శ్రీధర్ వెల్లడించారు. ఇంకా అన్ని స్టడీ సర్కిల్స్‌ను సంబంధించిన వివరాలు రావాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

### నాణ్యమైన కోచింగ్ వల్లే ఈ ఫలితాలు



గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీ స్టడీ సర్కిల్స్‌లో శిక్షణ పొందిన 182 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ కొలువులు సాధించారు.నాణ్యమైన కోచింగ్ వల్లే మంచి ఫలితాలు సాధించాం. సీఎం కేసీఆర్ అందిస్తున్న ప్రోత్సాహం, కల్పిస్తున్న వనరుల ఫలితాల వల్లే ఇది సాధ్యమైంది. అందుకు సీఎం కేసీఆర్‌కు నా కృతజ్ఞతలు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

*- గంగుల కమలాకర్, సంక్షేమశాఖ మంత్రి*

# ‘కృష్ణా ట్రిబ్యునల్’పై గెజిట్

మొదటిపేజీ తరువాయి...

కూడా బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ -2 విచారణ కొనసాగిస్తుంది.

పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మళ్లించడంతో కృష్ణాలో ఏర్పడిన 80 టీఎంసీల మిగులు జలాల్లో ఉమ్మడి ఏపీకి 45 టీఎంసీలను కేటాయించారు. ఆ జలాలను నాగార్జునసాగర్ ఎగువన మాత్రమే వాడుకోవాల్సి ఉన్నది. ఆ 45 టీఎంసీల జలాలపైనా ట్రిబ్యునల్ విచారణ జరిపి ఏపీ, తెలంగాణకు పంచాల్సి ఉన్నది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం 1956 సెక్షన్ 5(1) ప్రకారం ట్రిబ్యునల్-2 విచారణ జరిపి నివేదిక సమర్పించాలి.




